# సాటి మనిషి

- కోలపల్లి ఈశ్వర్

"చెయ్... చెయ్..." ఓ సన్నపాటి రాయి అందుకుని డస్ట్‌బిన్ దగ్గర తచ్చాడుతున్న కుక్కమీదకు విసిరాడా ముసలాడు. అది 'కుయ్'మంటూ వెనక్కి తగ్గి, మళ్లీ గుర్రుమంటూ ముందుకొచ్చిందా నల్ల కుక్క.

ఇంకో రాయి విసిరి దాన్ని దూరంగా తరిమి- ఆదరా బాదరా వచ్చాడు డస్ట్‌బిన్ దగ్గరికి- అక్కడే గొంతుక్కూర్చుని మధ్యకు మడిచి, విసిరి వేయబడివున్న ఎంగిలాకును ఆశగా విప్పాడు. అందులో అక్కడక్కడా అంటుకుని వున్న ఎంగిలి పదార్థాల్ని అరచేత్తో ఆకు మధ్యగా పోగుచేశాడు.

దగ్గరకు రాబోతున్న కుక్కని ఓ చేత్తో అదిలిస్తూ మరో చేత్తో ఆ ఎంగిలి మెతుకుల్ని ఆబగా నోట్లో పెట్టుకున్నాడు.



తోక ఊపుకుంటూ అతనికి ఎదురుగా కూర్చుంది కుక్క. నాలుకని ఇంత పొడవున చాపుకుని జొల్లు కారుస్తూ- ఆశగా చూస్తోంది.

అతనేమనుకున్నాడో ఏమో- తను తింటున్న దాన్లో కాస్త భాగాన్ని ఆకులోనే ఒక చివరికి తోశాడు... కుక్కని రమ్మని సైగ చేస్తూ...

కృతజ్ఞతగా చెవులాడించి- అతనికేసి భయంగా చూస్తూ- అందులో మూతి పెట్టిందది.

క్లిక్‌మంది శరత్ చేతిలోని కెమెరా.

"హార్ట్ మూవింగ్ ఇన్సిడెంట్... మనిషీ, కుక్కా కలిసి ఒకే ఎంగిలాకు నాక్కుంటున్నారు... మైగాడ్... వాట్ హేపెనింగ్ టు దిస్ సొసైటీ..." గాఢంగా నిట్టూర్చింది శశి.

కెమెరాని భుజానికి తగిలించుకుని, జేబులోంచి ఓ పది రూపాయల నోటు తీసి ఆ వృద్ధుడ్ని సమీపించాడు శరత్.

"ఇదిగో..."


అతను తబ్బిబ్బయ్యాడు. ఎంగిలి చేతిని మొలకు చుట్టుకున్న గుడ్డకు రాసుకుని, సంభ్రమంగా ఆ నోటందుకున్నాడు. కాళ్లకు మొక్కినంత పని చేశాడు.

"చెప్పటం మర్చిపోయాను...మా శరత్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్... ఇట్లాంటి హృదయ విదారకమైన దృశ్యాల్ని ఫొటోల్లో పొందుపరిచి- మేగజైన్స్‌కు ఫొటో ఫీచర్స్ రాయడం అతని హాబీ..." ప్రభాకర్ శశితో చెప్పాడు.

ప్రభాకర్, శశి భార్యాభర్తలు. సైట్ సీయింగ్ కని నెల్లూర్‌నుండి హైదరాబాద్ వచ్చి, స్నేహితుడైన శరత్ ఇంట్లో దిగారు. ప్రస్తుతం టాక్సీలో గోల్కొండ వెళుతుంటే దారిలో కనబడిందా దృశ్యం... టాక్సీ ఆపి, దిగి ఆ స్నాప్ తీసుకున్నాడు శరత్.

"హాబీ"అన్న ప్రభాకర్ మాటల్ని శరత్ రిసీవ్ చేసుకోలేనట్టు చూశాడు... "హాబీ...ఏంట్రా... దీన్ని బాధ్యత అను- లేదా సాటి మనిషి కష్టాన్ని తీర్చలేకపోయినా. కనీసం అర్థంచేసుకునే ప్రయత్నం అను... అతని కష్టాన్ని పది మందికీ తెలియజెయ్యాలనే తపన అను... దట్సిట్..."

నిజమే అనిపించింది శశికి. అతని వంక అడ్మయిరింగ్‌గా చూసింది. "ఈమధ్య నేనో మ్యాగజైన్‌లో "ది హ్యూమన్ వితవుట్ హ్యూమానిటీ"అన్న ఆర్టికల్ చదివాను. దాన్ని చదివాక మనసుకి టచ్చింగ్‌గా అనిపించింది. దాని ఆథర్ నేమ్ 'శరత్'అని రాసి వున్నట్లు గుర్తు. ఫర్ హేప్స్... ఆ శరత్తూ... మీరూ..."



"ఒక్కరే..." నవ్వారు శరత్.

"కంగ్రాచ్యులేషన్స్... ఎంత బాగా రాశారండీ... ఆ ఫీచర్‌కోసం... మీరుపయోగించిన ఫొటోగ్రాఫ్స్... రియల్లీ... హార్ట్ టచింగ్... ముఖ్యంగా చైల్డ్ లేబర్‌కి సంబంధించిన ఫొటోగ్రాఫ్ కంట తడి పెట్టించిందంటే నమ్మండి..." అంటూ భర్తకేసి తిరిగి "కదండీ..." అంటూ సాక్ష్యం అడిగింది.

"ఇవాల్టికింతేనా... గోల్కొండ చూసేదేమైనా వుందా?" అన్నాడు ప్రభాకర్ సన్నగా నవ్వుతూ.

శరత్, శశి ఒకరి ముఖాలొకరు చూసుకుని నవ్వుకున్నారు.

గోల్కొండ వైపుగా టాక్సీ సాగిపోతుంటే...

శశి వెయ్యి కళ్లతో... పరిసరాల్నే పరిశీలిస్తూ... రెండు మూడు చోట్ల టాక్సీ ఆపించి, శరత్ చేత స్నాప్స్ తీయించింది.

"ఇప్పుడు మీరు సజెస్ట్‌చేసిన ఫొటోస్ నేను ఫ్రెష్‌గా మొదలుపెట్టినా 'థింక్ విత్ ద హార్ట్. బట్ నాట్ విత్ ద బ్రెయిన్'అనే ఆర్టికల్‌కి చక్కగా పనికొస్తాయ్... ఈ విషయంలో నేను మీకు థేంక్స్ చెప్పక తప్పదు..." మనస్ఫూర్తిగా అన్నాడు శరత్.

వీళ్ల వరస చూస్తున్న ప్రభాకర్ తల పట్టుకున్నాడు. "బాప్‌రే... హైదరాబాద్ అందాలు చూపించరా ఫ్రెండూ అంటే... ఇక్కడి ముష్టోళ్లనీ, మురిగ్గుంటల్నీ చూపిస్తావ్... ఇదెక్కడి, అన్యాయంరా బాబూ... ఇద్దరికిద్దరు తోడై నా ఈస్థటిక్ సెన్స్‌ని ఈసురోమనిపిస్తున్నారు...

ప్రభాకర్ మాటలకి శశి ఫక్కున నవ్వింది. శరత్ కూడా నవ్వేసి అన్నాడు "సారీరా... ప్రస్తుతానికి ఈ ఫొటో సెషన్ని ఆపేస్తున్నా...ఇక స్నాప్ షూటింగ్ అంటూ వుంటే... అది గోల్కొండ అందాల్ని బంధించడానికే... ఐ ప్రామిస్ యు..."

* * *

"ఎట్లా వుంది మా గోల్కొండ?" అడిగింది రజని.

"గోల్కొండ మీ ముత్తాతదామ్మా? 'మా' అంటున్నావ్?" శరత్ భార్యమీద జోక్ పేల్చాడు.

"ఫెంటాస్టిక్... నిజం చెప్పాలంటే గతించిపోయిన అద్భుతమైన కలలా ఉంది... శిథిలమైపోయిన ఆ కట్టడాల్ని చూస్తుంటే మనసేంటోగా అయిపోయిందండీ... ఒకానొకప్పుడు ఆ కోటలన్నీ జన సందోహంతో కళకళలాడుతుండేవి- అన్న ఫీలింగ్... వూపిరాడనివ్వ లేదు...ప్చ్... ఇవాళ్టి అస్థిత్వం రేపటికి ఒట్టి జ్ఞాపకమేనేమో..." శశి గాఢంగా నిట్టూర్చింది.

"అంతేకదండీ... ఇవాళ మనమున్నాం... రేపు ఉంటామో లేదో తెలీదు... కొన్నాళ్లకు అసలే ఉండం... మనం చెయ్యవలసిందల్లా... నలుగురూ గుర్తుంచుకునేలా నాలుగు జ్ఞాపకాల్ని మిగిల్చిపోవడమే..." అంది రజని.

ప్రభాకర్ అన్నాడు "నిన్ను మాత్రం మిస్సయ్యాం చెల్లెమ్మా... నువ్వూ వచ్చుంటే బాగుండేది..."

"ఏం చెయ్యను? అత్తయ్యకోవంకా, బాబుకో వంకా... ఇద్దరికీ జ్వరమాయె..." అన్నది రజని బాధగా ముఖం పెట్టి.

"అన్నట్టు బాబుకి జ్వరమెట్లా వుంది రజనీ?" అడిగాడు శరత్... అడుగుతూనే, ఆమె సమాధానంకోసం నిరీక్షించకుండా హడావుడిగా బెడ్‌రూమ్‌లోకెళ్లాడు.

"కాస్త పర్లేదండీ... ఇందాకే బత్తాయి రసం తీసి తాగించాను..." చెబుతూ అతని వెనుకే వెళ్లిందామె.

శశీ, ప్రభాకర్ కూడా లోపలికి వెళ్లారు. శరత్ బెడ్ మీద నీరసంగా పడివున్న కొడుకు ఒంటిని ఆప్యాయంగా తడిమి... నుదుటి మీద చేతిని వుంచాడు. "వేడిగానే ఉంది... ఒన్నాట్ ఒన్ వుండొచ్చు..."

"నయంకదా... గంటక్రితం... ఒన్నాట్ త్రీ దాకా ఉన్నది..." చెప్పింది రజని. కొడుకు బుగ్గలు తాకుతూ.

"పాలు పట్రా పో..."

లోనికెళ్ళి గ్లాసు నిండా పాలు తెచ్చిందామె.

"బంగారూ... నాన్నా... తేజా... కొంచెం పాలు తాగరా..."

"వద్దు డేడీ... ఇప్పుడే జ్యూస్ తాగాను..."

"అది మమ్మీకోసం... పాలేమో డేడీకోసం..."

"ఊహూ!... వద్దు డేడీ..."

"ప్లీజ్... నా వరాల మూట కదూ..."

వద్దంటున్నా బలవంతంగా లేపి, కూర్చోబెట్టి నోటికి పాల గ్లాస్ అందించాడు శరత్.

కొంచెం తాగి... భళ్ళున వాంతి చేసుకున్నాడు తేజ.

"రజనీ... డాక్టర్‌కి ఫోన్ చెయ్..." కంగారుగా చెప్పాడ తను.

"పళ్ల రసం తాగి మళ్లీ పాలు తాగినందువల్ల అట్లా అయింది లేరా... కంగారు పడక..." చెప్పాడు ప్రభాకర్ శరత్‌ని కన్సోల్ చేస్తూ.

"మీరెళ్లి స్నానం చెయ్యండి" చెప్పింది రజని అక్కడే నిలబడి వున్న శశితో.

శశి బాత్‌రూమ్ వైపు వెళుతున్నప్పుడు- హఠాత్తుగా గుర్తుకొచ్చింది రజని అత్తయ్య.

'ఇంతకీ ఆవిడకెలాగుందో?' అనుకుంటూ ఆమె గది లోకి తొంగి చూసింది శశి.

మసక చీకట్లో నిండా దుప్పట్ని కప్పుకుని ముణగ దీసుకుని పడుకుని వుంది ఆమె.

"అరె... లైటు కూడా వేసుకోలేదే..." శశి లైట్ స్విచ్ వెతికి ఆన్ చేసింది. ఆమె దగ్గరగా వెళ్లి ముఖంమీంచి దుప్పటి కొంచెం లాగి, నుదురు పట్టుకుని చూసింది. జ్వరం పేలిపోతోంది. ఒళ్లెరక్కుండా పడి వుండేమో- కనీసం శశి చేతి స్పర్శకూడా ఆమెకు మెలకువ తెప్పించ లేదు.

శశి స్నానం విషయం వాయిదావేసి, రజని దగ్గరికెళ్లి విషయం చెప్పింది.

"ఇందాకే ఆవిడ టాబ్లెట్ వేసుకున్నారు... తగ్గిపో తుంది లెండి"

ఇటు తిరక్కుండానే చెప్పింది రజని.

ఆమె స్వరంలో వినబడ్డ నిర్లక్ష్యం శశి గమనించేసింది.

"ఏమైనా తిన్నారా?" అడిగింది శశి.

"ఎంత చెప్పినా వింటేనా... తనకై తనకి బుద్ధిపుడితే తప్ప - ఆవిడ చేత తినిపించడం బ్రహ్మతరం కూడా కాదు... చెబుతూనే అక్కడినుంచి ఏదో పనున్నట్లు వెళ్లి పోయింది రజని.

మరుసటి రోజు- శరత్ సైట్‌సీయింగ్‌కి తీసుకెళ్తానన్నా ప్రభాకర్ ఒప్పుకోలేదు... "ముందు వాళ్ల జ్వరాలు తగ్గ నీండి. తర్వాత వెళ్దాం..."అని నిశ్చయంగా చెప్పేశాడు.

శశి మాత్రం శరత్‌నడిగి కెమెరా తీసుకుంది- రెండు స్నేప్స్ తీసుకుంటానని.

"రెండేం ఖర్మ... ఇంకా టెన్ స్నేప్స్ మిగిలి వున్నాయం దులో మొత్తం తీసుకోండి... నో అబ్జక్షన్..." చెప్పాడ తను.

"నో... రెండే రెండు...చాలు..." చెప్పింది శశి.

* * *

ఆరోజు సైట్ సీయింగ్‌కి రజనీ, తేజా కూడా వచ్చారు.

సాయంత్రంవరకూ తిరిగాక- ఆడవాళ్లిద్దర్నీ తేజాని ఆటో ఎక్కించి చెప్పాడు శరత్. "మీరింటికి వెళ్లిపోండి... నేనూ, ప్రభూ స్టూడియోకెళ్లి ప్రింట్స్ రెడీ అయ్యుంటే తీసుకొస్తాం..."

ఆటో వెళ్లిపోయాక ఇద్దరూ స్టూడియోకెళ్లారు. అక్కడ ప్రింట్స్ తీసుకున్నాక అన్నాడు శరత్.

"ప్రభూ! షల్ వీహేవ్ ఎ కప్ ఆఫ్ కాఫీ?"

ఇద్దరూ దగ్గర్లో వున్న రెస్టారెంట్‌కెళ్లారు.

ముందు ఒట్టి కాఫీ అనుకుని వచ్చినా, కూర్చున్నాక టిఫిన్ ఆర్డర్ చేశాడు శరత్.

"ఏవీ ఆ ప్రింట్స్ ఇట్లా ఇవ్వు" ప్రభాకర్ అడిగాడు.

టిఫిన్ ఇంకా రాకపోవటంతో ఇద్దరూ ప్రింట్స్ చూస్తు న్నారు. శరత్ ఒక్కొక్కటీ చూసి ప్రభాకర్‌కి పాసాన్ చేస్తు న్నాడు.

కొన్ని శరత్ స్పెషల్ ఇంట్రస్ట్‌తో తన ఫొటో ఫీచర్ కోసం తీసినవీ... కొన్ని సైట్ సీయింగ్‌లో తీసినవీ...

"చాలా బాగా వచ్చాయ్..." ప్రభా కర్ అన్నాడు.

"అరే...ఇదేంటీ... నేను తియ్యలేదే... బహుశా శశి తీశారేమో... ఓ ప్రింట్‌ని ప్రభాకర్‌కి అందిస్తూ ఆశ్చర్యంగా అన్నాడు శరత్.

ప్రభాకర్ కేజువల్‌గా అందుకుని చూసి తనూ ఆశ్చర్యపోయాడు

అందులో-

జ్వరంతోవున్న తేజాని గుండెలకు హత్తుకున్నట్టుగా కూర్చోబెట్టుకుని వున్నాడు శరత్- జ్యూస్ గ్లాస్ తేజా నోటికందిస్తున్న రజని ముఖంలో అంతులేని మమకారం. అలవికాని ఆందోళనా ముప్పిరిగొని వున్నాయ్.

"పిల్లాడు జ్వరంతో వుంటే- ఇట్లా ఫొటో తియ్యడమేంటి? షి ఈజ్ మేడ్..." అన్నాడు ప్రభాకర్ నొసలు చిట్లించి.

"ఇది చూడు..." ఇంకో ప్రింట్‌ని అందించాడు శరత్.

ఇందులో-

మసక చీకట్లో, ఒంటినిండా కప్పుకున్న దుప్పట్లో ఒంటరిగా గువ్వలాగా ముడుచుకుని పడుకుని వుంది శరత్ తల్లి సుమిత్రమ్మ.

"ఏమైంది శశికి?" ప్రభాకర్ అసహనంగా అన్నాడు.

ఆ ఫొటోగ్రాఫ్స్ గురించే డిస్కస్ చేసుకుంటూ ఇద్దరూ టిఫిన్ కానిచ్చారు. కాఫీ తాగి బయటపడ్డారు.

అరగంట తర్వాత- రజనీ, శశీ ప్రింట్స్ చూస్తున్న ప్పుడు అడిగాడు శరత్- "మీరేవో స్నేప్స్ తీసుకుంటా నని కెమెరా అడిగారు- అవి ఇవే కదూ?"

అన్నిటితో కలపకుండా ప్రత్యేకంగా వేరుచేసి పెట్టిన ఆ ప్రింట్స్‌ని శశి చేతికిచ్చాడతను.

"ఎక్సలెంట్... బాగా వచ్చాయ్" అంది శశి వాటికేసి తృప్తిగా చూస్తూ.

"ఎందుకట్లాంటి ఫొటోలు తీశావ్?" అడిగాడు ప్రభా కర్- స్వరంలో కొద్దిగా చిరాకుని ప్రదర్శిస్తూ.

"ఒకటి తేజాకోసం- ఇంకోటి శరత్‌గారి కోసం..." చెప్పిందామె నిదానంగా. ఇంకా ఫొటోల వంక చూస్తూ.

రజనీ, శరత్ ముఖాముఖాలు చూసుకున్నారు.

శశి బయట ఆడుతున్న తేజాని కేకేసి పిల్చింది. వాడి చేతిలో ఓ ఫొటోగ్రాఫ్ పెట్టి అడిగింది" ఎట్లా వుంది తేజా?

"ఛీ... ఏం బాలేదాంటీ... జ్వరంలో అసయ్యంగా వున్నా..." అన్నారు తేజా.

"నువ్వు సరే- అమ్మా నాన్నా ఎట్లా వున్నారు?"

"వాళ్లుకూడా బాలేరు... దిగులుగా కనబడుతు న్నారు..."



డస్ట్‌బిన్ దగ్గర వృద్ధుడి ఫొటో తీసిన ప్పుడు మీర న్నారు చూడండి... ఇది హాబీ కాదు బాధ్యతనీ... సాటి మనిషి కష్టాన్ని తీర్చలే కపోయినా అర్థంచేసుకునే ప్రయత్నమనీ... అతని కష్టాన్ని పది మందికీ తెలి యజెయ్యాలనే తపన అనీ... సేమ్... అవే ఫీలింగ్స్‌తో నేనీ ఫొటో తీశాను.

"ఎవరికోసం దిగులు పడుతున్నారు?"

తేజా ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు- "నాకో సమే...నాకు జ్వరమని వాళ్లకి బాధ..."

"మరి వాళ్లకేమైనా అయితే- నువ్వూ దిగులు పడతా వుగా..."

"ఊం..."

"ఎందుకట్లా దిగులు పడాలి తేజా?"

"ఎందుకంటే- వాళ్లు నా మమ్మీ డేడీ కదా- నాకు వాళ్లంటే ఎంతో ప్రేమ కాబట్టి..."

"పెద్దయ్యాక్కూడా...అంటే.. నీకు పెళ్లయి... పిల్లలు పుట్టేసింతర్వాత కూడా మీ మమ్మీ డాడీల్ని ప్రేమిస్తావా?"

"ఓ... తప్పకుండా..."

"వాళ్లప్పటికి ముసలి వాళ్లయ్యుం టారు..."

"అయితే... ఏం?" వారు ఆశ్చ ర్యంగా చూశాడు.

"అయినా ప్రేమిస్తావన్నమాట... యు ఆర్ గుడ్ బోయ్... ఒకవేళ నువ్వు అప్పట్లో వాళ్లని ప్రేమించలేకపోయావ నుకో. ఈ ఫొటోగ్రాఫ్ చూసి ఆదరించ టానికి ప్రయత్నించు... నీ మీద... నీ తల్లిదండ్రులు ఎంతటి ప్రేమ కురిపించే వారో... నీకు ఏ కాస్త బాగలేకున్నా ఎట్లా తల్లడిల్లిపోయే వారో... ఇది నీకు చెబు తుంది. ఫ్యూచర్ యూజ్‌కోసం. ఇది నీకు నేనిచ్చే గిఫ్ట్... భద్రంగా దాచుకో..."

శశి రెండో ఫొటోని శరత్ చేతికిచ్చి, మలినమైన అతని ముఖంలోకి సూటిగా చూస్తూ చెప్పింది. "ఇది మీ ఫీచర్ యూజ్‌కోసం పిల్లల నిరాదరణకు గురైన వృద్ధుల స్థితి ఎంత దయనీయంగా వుంటుందో చెబుతోంది కదూ... ఈ స్నేప్! డస్ట్‌బిన్ దగ్గర వృద్ధుడూ- చిత్తుకాగితాలేరే పసి వాడూ... ఇట్లా మీరు నెంబరాఫ్ స్నేప్స్ సేకరించారుగా... అందులో ఒకటిగా దీన్ని ఉపయోగించండి... కాకపోతే మీ స్నేప్ షూటింగ్ ఔట్‌డోర్... నావి ఇన్‌డోర్... కానీ, ఎక్కడయినా మనిషి పడే ఆవేదన ఒక్కటేగా... సో... తప్పకుండా మీ ఫొటో ఫీచర్‌లో దీన్ని ఇన్‌సర్ట్ చెయ్యండి...

శరత్ ముఖం వాలిపోయింది.

"డస్ట్‌బిన్ దగ్గర వృద్ధుడి ఫొటో తీసినప్పుడు మీర న్నారు చూడండి... ఇది హాబీ కాదు బాధ్యతనీ... సాటి మనిషి కష్టాన్ని తీర్చలేకపోయినా అర్థంచేసుకునే ప్రయ త్నమనీ... అతని కష్టాన్ని పది మందికీ తెలియజెయ్యా లనే తపన అనీ... సేమ్... అవే ఫీలింగ్స్‌తో నేనీ ఫొటో తీశాను. మీ ఆదరణకోసం, మీ ఇంట్లోనే ఓ జీవి అర్రులు చాస్తోందని తెలియజెయ్యడానికే... నేను చేసిన చిన్న ప్రయత్నమిది..." ఆమె చెప్పటం ఆపింది.

అతని ముఖం మ్లానమయ్యింది. అది కోపంతోనా- సిగ్గుతోనా- అవమానం తోనా- అనేది శశికి అర్థంకాలేదు.

అందుకే అతని ముఖానికేసి పరీక్షగా చూస్తూ చెప్పింది.

"మీరీ ఫొటోఫీచర్ రాసేటప్పుడు- ప్లీజ్ థింక్ విత్ ద హార్ట్... బట్ నాట్ విత్ ద బ్రెయిన్..." ★

రచయిత చిరునామా:
కొలపల్లి ఈశ్వర్,
3-1-85, నవాబుపేట, నెల్లూరు- 524 002.